క్లుప్తంగా

బడుగులకు అండగా..

కుల్కచర్ల: బడుగుబలహీనవర్గాల ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి అన్నారు. కామునిపల్లి గ్రామానికి చెందిన సున్నల రామయ్య అనారోగ్యంతో రెండురోజుల క్రితం మృతిచెందారు. విషయం తెలుసుకున్న రామ్మోహన్‌రెడ్డి మంగళవారం బాధిత కుటుంబీకులను పరామర్శించారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, బ్లాక్‌టు అధ్యక్షుడు భరత్ కుమార్, మాజీ ఎంపీపీ అంజిలయ్య, కుల్కచర్ల ఎంపీటీసీ ఆనందం, నాయకులు రాఘవేందర్ రెడ్డి, రాములు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తాండూరు నియోజకవర్గ బాధ్యతలు ఇవ్వండి



కాసానికి వినతిపత్రం అందజేస్తున్న శ్రీనివాస్

బషీరాబాద్: టీడీపీ తాండూరు నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలు తనకు అప్పగించాలని బషీరాబాద్ మండలం కొర్విచెడ్ గ్రామానికి చెందిన పార్టీ నాయకుడు శ్రీనివాస్.. ఆ పార్టీ తెలంగాణ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్‌ను కోరారు. ఈ మేరకు మంగళవారం టీడీపీకి చెందిన పలువురు కార్యకర్తలతో హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ భవన్‌లో కాసానికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో తనకు తాండూరు నుంచి టికెట్ ఇవ్వాలని కోరినట్లు చెప్పారు. పార్టీలో కష్టపడి పనిచేస్తున్నానని, తనకు అవకాశం ఇవ్వాలని పేర్కొన్నట్లు తెలిపారు. దీనికి కాసాని సానుకూలంగా స్పందించినట్లు వెల్లడించారు. యాలాల మాజీ సర్పంచ్ అంజిలయ్య, మాజీ సర్పంచ్ నర్సింహులు, మైనార్టీ నాయకులు ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కు అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు

షాబాద్: ఆపదలో ఉన్న ప్రతీ కుటుంబాన్ని ఆదుకుంటామని షాబాద్ జెడ్పీటీసీ సభ్యుడు పట్నం అవినాశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆరుగురు బాధితులకు మంజూరైన రూ.2.50లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ.. ప్రతీ దరఖాస్తుదారుడికి సీఎంఆర్ఎఫ్ అందజేసిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ చల్లా శేఖర్‌రెడ్డి, సర్పంచ్ పాండురంగారెడ్డి, ఉప సర్పంచ్ సందీప్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శివప్ప, శివరాజ్‌గౌడ్, మచ్చేందర్‌గౌడ్, రాందేవ్ యాదవ్, మహేందర్ పాల్గొన్నారు.

26నుంచి పాదుక ప్రతిష్ఠాపన వార్షికోత్సవం



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

శంకర్‌పల్లి: మండల పరిధిలోని కొత్తపల్లి శివరులోని మాణికేశ్వరీ మాత పాదుక ప్రతిష్ఠాపన 18వ వార్షికోత్సవం ఈ నెల 26 నుంచి 29వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉత్సవాల వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఉత్సవాలకు భక్తులు పెద్ద ఎత్తున హాజరవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ కార్యదర్శి హరిశంకర్, కోశాధికారి ప్రభు, గౌరవ సభ్యులు లింగారెడ్డి, నర్సింహులు, మాణిక్య, హన్మంత్‌రెడ్డి, సలహాదారులు వెంకటేశ్, సభ్యులు భూషణం, ఆనందం, నర్సింలుగౌడ్, విశ్వంచారి, రాంచంద్రయ్య, సంఘమేశ్వర్ పాల్గొన్నారు.

ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలి

చేవెళ్ల: అధికారులు సమన్వయంతో పనిచేసి కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చేవెళ్ల ఆర్డీఓ వేణుమాధవ్‌రావు అన్నారు. మంగళవారం ఆయన చేవెళ్ల ఆర్డీఓ కార్యాలయంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ దామోదర్ ఆధ్వర్యంలో డివిజన్ స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 19 నుంచి నిర్వహించే కంటి వెలుగు కార్యక్రమానికి బుధవారం ఎంపిక చేసిన గ్రామాల్లో ట్రయల్ రన్ నిర్వహించాలన్నారు. ఇబ్బందులు తలెత్తకుండా ముందుగానే ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. డివిజన్ పరిధిలోని చేవెళ్ల, శంకర్‌పల్లి, షాబాద్, మొయినాబాద్ మండలాల పరిధిలోని పీహెచ్‌సీల అధికారులు, సిబ్బంది ఎప్పటికప్పుడు కేంద్రాల వద్ద నుంచి సమాచారం ఇవ్వాలన్నారు.

సాగుసాయం ఖాతాల్లోనే..



డబ్బులు డ్రా కాలేదంటూ ఖాతా బుక్కులు చూపిస్తున్న రేగడిమైలారం రైతులు

- అకౌంట్లో ఉన్నా.. అందని డబ్బులు
- కిసాన్ యోజన అందక పరేషాన్!
- సాంకేతిక సమస్యలతో రైతుల చింత

బొంరాస్‌పేట: రైతులకు కేంద్ర ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న పంట పెట్టుబడి సాయం పీఎం కిసాన్ యోజన అకౌంట్లలో ఉన్నా.. చేతికి రావడం లేదు. రెండు విడతలుగా పోస్టాఫీసు ఖాతాల్లో జమ అవుతూ అందకపోడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మండలంలో మొత్తం 16,215 మంది రైతులు ఉండగా.. వారికి సాగు సాయం కింద ప్రతిసారి రూ.19,26,91,183 అందుతున్నాయి. ప్రస్తుత పెట్టుబడి డబ్బుల్లో ఇప్పటివరకు 13,377మంది రైతుల ఖాతాల్లో రూ.11,74,79,851 డబ్బులు జమ అయినప్పటికీ.. తపాలా ఖాతాదారులైన రైతులకు అందలేదు. డ్రా చేసుకునే వెసులుబాటు లేకపోవడంతో వారు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకొని, సాగు సాయం సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

సాంకేతిక సమస్య

పోస్టాఫీసుల్లో నెలకొన్న సాంకేతిక సమస్య కారణంగా రైతులకు రెండు విడతలుగా పీఎంకిసాన్ యోజన (పెట్టుబడి సాయం) డబ్బులు అందడం లేదు. డ్రా చేసి ఇచ్చినా.. రైతు ఖాతానుంచి డెబిట్ కాకపోవడంతో.. ఆ ప్రక్రియను నిలిపివేశారు. దీన్ని సరిచేయడానికి ఇంకా సమయం పడుతుందని అధికారులు చెబుతున్నారు.

రెండు విడతలుగా..



నాకు ప్రతిసారి రూ.4వేల వరకు కిసాన్ యోజన డబ్బులు వస్తాయి. ఉపాధిహామీ డబ్బులు పోస్టాఫీసు ద్వారా అందేవి. అలాగే పెట్టుబడి సాయం డబ్బులు కూడా వచ్చేవి. ఈ రెండు విడతలుగా డబ్బులు డ్రా చేసుకోవడానికి రావడం లేదు. అధికారులను అడిగితే సమస్య ఉందని చెబుతున్నారు.

– నెల్లి విఠలయ్య, రైతు

సమస్య పరిష్కరించాలి



పోస్టాఫీసుకు వెళ్లి పెట్టుబడి డబ్బులు డ్రా చేసుకుందామంటే ఇవ్వడం లేదు. ఊర్లో బీపీఎంను అడిగాం. కొడంగల్‌కు వెళ్లి ఆర్‌ఓకు విన్నవించాం. డ్రా చేయడానికి వీలు కావడం లేదని చెబుతున్నారు. సంబంధిత అధికారులు సమస్యను త్వరగా పరిష్కరించాలి.

– కెరెల్లి నర్సింహులు, రైతు

పాదయాత్రగా మల్లన్న సన్నిధికి..

కొడంగల్ రూరల్: శ్రీశైలం వెళ్లే భక్తులు మల్లికార్జున స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం శ్రీస్వామివారికి పంచామృతంతో అభిషేకం, అష్టోత్తర శతనామావళి, ధూప, దీప నైవేద్యాలను సమర్పిస్తూ ప్రత్యేక పూజలు జరిపారు. మంగళహారతులు పడుతూ దర్శించుకున్నారు. అనంతరం శ్రీశైలం పుణ్యక్షేత్రానికి పాదయాత్రగా భక్తులు బయల్దేరారు. నీళ్లపల్లి నుంచి 10మంది, రుద్రారం నుంచి 25మంది భక్తులు వెళ్లారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు దామోదర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, శివరాములు, లక్ష్మీకాంత్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, శరణ్, చంద్రశేఖర్, విశ్వనాథం, మల్లేశం, మహిపాల్, నర్సింహారెడ్డి, భారతమ్మ, రత్నమాల పాల్గొన్నారు.

మహా పాదయాత్రగా..



తాండూరు టౌన్: పాదయాత్రగా శ్రీశైలం బయలుదేరిన శివ భక్తులు

తాండూరు టౌన్: మహా పాదయాత్రగా శివ భక్తులు శ్రీశైలం బయలుదేరి వెళ్లారు. శ్రీభావిగి భద్రేశ్వర దేవాలయంలోని శివాలయంలో శివుడికి ప్రత్యేక పూజ అనంతరం బీఆర్ఎస్ తాండూరు ప్రచార కార్యదర్శి సాగర్ గౌడ్ ఆధ్వర్యంలో రసూల్‌పూర్ హనుమాన్ ఆలయం నుంచి యాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ ఏటా సంక్రాంతి అనంతరం శివ భక్తులు పాదయాత్రగా శ్రీశైలం వెళ్లడం ఆనవాయితీగా వస్తోందని, వీరితో పాటు పలువురు శైవ భక్తులు సైతం పాదయాత్రలో పాల్గొంటారన్నారు. ఈ ఏడాది 150 మందికి పైగా భక్తులు వారం రోజుల పాటు కాలినడకన శ్రీశైలం చేరుకుని, మల్లన్నను దర్శించుకుంటారని తెలిపారు. బీఆర్ఎస్ కౌన్సిలర్ నీరజాబాల్‌రెడ్డితో పాటు పలువురు భక్తులు పాదయాత్రగా శ్రీశైలం బయలుదేరారు.

క్రీడలతో మానసికోల్లాసం

పూడూరు: క్రీడలతో మానసికోల్లాసంతో పాటు శరీరదారుఢ్యం పెంపొందుతుందని సర్పంచ్ జయమ్మదాస్ అన్నారు. మంగళవారం అంగడిచిట్టంపల్లి గ్రామంలో సంక్రాంతి సందర్భంగా వాలీబాల్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపు ఓటములు సమానంగా తీసుకోవాలని, క్రీడాస్ఫూర్తితో ముందుకెళ్లాలని సూచించారు. అనంతరం గెలుపొందిన దామరగిద్ద జట్టుకు మొదటి బహుమతి 20వేలు, శివారెడ్డిపేట్ జట్టుకు ద్వితీయ బహుమతి 10వేల నగదుతో పాటు మెమొంటోలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సత్తయ్య, నిర్వాహకులు రైనాచంద్, రాజేందర్‌గౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పూడూరు: విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న సర్పంచ్

కుల్కచర్ల: క్రీడలు మానసికోల్లాసాన్ని పెంపొందిస్తాయని అంతారం సర్పంచ్ కృష్ణ, బిందెంగడ్డ సర్పంచ్ తుల్జ్యానాయక్ అన్నారు. అంతారంలో కొనసాగుతున్న క్రికెట్ టోర్నీలో భాగంగా మంగళవారం ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యువత క్రీడల పట్ల మక్కువ పెంచుకోవాలని సూచించారు. పోటీల్లో అంతారం మొదటి బహుమతి పొందగా.. చౌదర్‌పల్లి పెద్దతండా రెండో స్థానంలో నిలిచింది. కార్యక్రమంలో ఎంపీటీసీ లలితమ్మ, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు సార శ్రీనివాస్, నాయకులు బోయిని మొగులయ్య, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

రక్షణ కవచంలా నిఘానేత్రాలు

ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్



సీసీ కెమెరాలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

అనంతగిరి: సీసీ కెమెరాలు గ్రామానికి రక్షణ కవచంలా పనిచేస్తాయని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. ఈ మేరకు మంగళవారం వికారాబాద్ మండలంలోని మైలార్‌దేవరాంపల్లిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. కాలానికి అనుగుణంగా టెక్నాలజీని వినియోగించుకుని, సమాజ సంక్షేమం కోసం పాటుపడాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. గ్రామాభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తిరుపతిరెడ్డి, సీఐ శీను, పలువురు నాయకులు పాల్గొన్నారు.

పార్టీలో చేరిక

గ్రామానికి చెందిన 60మంది.. ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

నూతన కమిటీ నియామకం

కుల్కచర్ల: కుల్కచర్ల నాయీ బ్రాహ్మణ సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం బండవెల్కిచర్ల గ్రామ పరిధిలోని శ్రీపాంబండ రామలింగేశ్వర దేవస్థానంలో నూతన కమిటీని నియమించారు. సంఘం అధ్యక్షుడిగా రమేష్, ప్రధాన కార్యదర్శి యాదగిరి, ఉపాధ్యక్షుడు నరేష్, కోశాధికారి సువానయ్య, కేశవులు, గౌరవ అధ్యక్షుడిగా జగదీశ్వర్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు రమేష్ మాట్లాడుతూ.. నాయీ బ్రాహ్మణ ప్రజల సమస్యల పరిష్కారానికి తాము నిరంతరం కృషిచేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సత్యనారాయణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణ నేడు

మర్పల్లి: తుమ్మలపల్లిలో బుధవారం ఉదయం 10 గంటలకు ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ కార్యక్రమం ఉందని శివాజీ యువజన సంఘం నాయకుడు సాయిపటేల్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విగ్రహప్రతిష్ఠాపనకు ముఖ్య అతిథులుగా బర్దీపూర్ అవదూత గిరి మహారాజ్‌తో పాటు మాదుగుల సర్వోత్తమ శర్మ, విగ్రహ దాతలు హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు.

నేడు పల్లెపల్లెకూ కాంగ్రెస్

మర్పల్లి: పంచలింగాల, మల్లిఖార్జునగిరి, రామపూర్, అల్లాపూర్‌లో బుధవారం పల్లెపల్లెకూ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్‌సాగర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పార్టీ బ్లాక్-2 అధ్యక్షుడు కృష్ణారెడ్డి రానున్నారని తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

దోమ: గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ మల్లేశ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఐనాపూర్‌లో బోరుమోటార్‌కు మరమ్మతు చేయించి మాట్లాడారు. మిషన్ భగీరథ నీటిలో అంతరాయం ఏర్పడిన సమయంలో గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రత్యామ్నాయంగా బోరు మోటార్లను బాగు చేయించి, తాగునీటి సరఫరాకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ చెప్పారు.



నెత్తిన బోనంతో మహిళలు



పూజలు అందుకున్న అమ్మవారు

ఘనంగా ఊరడమ్మ ఉత్సవాలు

పెద్దేముల్: నర్సపూర్, జనగాం గ్రామాల్లో ఊరడమ్మ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. మూడు రోజుల పాటు సాగిన జాతర.. మంగళవారంతో ఆంగరంగవైభవంగా ముగిసింది. ఉత్సవాల్లో భాగంగా దేవతామూర్తులకు భక్తులు ప్రత్యేక పూజలు చేసి, నైవేద్యం సమర్పించారు. బోనమెత్తిన భక్తులు.. డప్పువాయిద్యాలతో శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలతో ఊరేగింపుగా వెళ్లి, అమ్మవారికి బోనం సమర్పించారు. ఈ సందర్భంగా ఎరుపుల సాని భవిష్యవాణి వినిపించారు.

పంచాయతీల్లో నిధుల్లేవు



సమీక్షలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ రాందాస్ నాయక్

- పథకాలు ఎలా అమలు చేయాలి?
- కంటివెలుగు సమీక్షలో సర్పంచుల ఆవేదన

కుల్కచర్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రజాహితమైన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా.. అందుకు అవసరమైన ఆర్థిక వనరులు తమవద్దలేవని మండల సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో కంటివెలుగు కార్యక్రమంపై నిర్వహించిన సమీక్షలో కుల్కచర్ల సర్పంచుల సంఘం అధ్యక్షుడు శంకర్ నాయక్, చాపలగూడెం సర్పంచ్ లక్ష్మణ్ మాట్లాడారు. చిన్న గ్రామపంచాయతీలలో నిధులు లేక సర్పంచులు ఇబ్బందులు పడుతున్నారని, 15వ ఆర్థిక సంఘం నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఉపయోగించుకోవడంతో జీపీలు నిధులలేమిగా మారాయని వాపోయారు. పలు గ్రామాల్లో విద్యుత్తు కనెక్షన్లు లేకుండానే కార్యకలాపాలు కొనసాగుతున్న పరిస్థితుల్లో.. ఇప్పటికిప్పుడు విద్యుత్తు కనెక్షన్లు ఇవ్వాలని పేర్కొనడం ఆర్థికంగా ఇబ్బందికరమని, విద్యుత్ శాఖ అధికారులే ఈ బాధ్యతను తీసుకోవాలని కోరారు. కంటివెలుగు విజయవంతానికి సమష్టికృషి చేస్తామని, కాని నిధుల విషయంలో తమను ఇబ్బందులకు గురిచేయొద్దన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జెడ్పీటీసీ రాందాస్ నాయక్ మాట్లాడుతూ.. ఎన్ని సమస్యలు ఉన్నా ప్రజలకు ఉపయోగపడే ప్రభుత్వ కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చెప్పారు.

రోడ్ల మరమ్మతులకు నిధులు

షాద్‌నగర్: రోడ్ల మరమ్మతులకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు మంజూరు చేస్తోందని షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని బాలాజీ ఫ్యాక్టరీ నుంచి జేపీ దర్గా వయా కొండన్నగూడ రోడ్డుకు రూ.3కోట్లు, మధురాపూర్ నుంచి బూర్గులకు రూ.1.15కోట్లు, బూర్గుల నుంచి పోతురాజుగడ్డ తండాకు రూ.59లక్షలు, మధురాపూర్ నుంచి కమ్మదనంకు రూ.55లక్షలు, పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి శేరిగూడకు రూ.60లక్షలు, పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి బూర్గుల వయా చిల్కమర్రి రోడ్డుకు రూ.4.15కోట్లు మరమ్మతులకు మంజూరయ్యాయి. ఈ పనులను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. మెరుగైన రవాణ కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని, రోడ్ల, మరమ్మతులకు కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తోందని తెలిపారు.

సంప్రదాయాలను మరవొద్దు

బీజేపీ నియోజకవర్గ పాలక్ జిట్టా బాలకృష్ణారెడ్డి

షాద్‌నగర్: యువత సంస్కృతిని, సంప్రదాయాలను మరవొద్దని బీజేపీ నియోజకవర్గ పాలక్ జిట్టా బాలకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని చటాన్‌పల్లి శివారులోని శివాలయంలో బీజేపీ నేత అంజయ్య శివ మాలధారణ స్వాములకు అన్నదానం ఏర్పాటు చేశాడు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జిట్టా బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక చింతన అలవరుచుకోవాలని, భక్తిభావాన్ని పెంపొందించుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. అంతే కాకుండా సేవాగుణం ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు శ్రీవర్ధన్‌రెడ్డి, మిథున్‌రెడ్డి, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య, దేపల్లి అశోక్‌గౌడ్, పాతపల్లి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో 'కంటి వెలుగు'

- కార్యక్రమాన్ని సద్వినియోగించుకోవాలి
- కంటి చూపును పరిరక్షించుకోండి
- అవగాహన కార్యక్రమాల్లో వైద్యులు, ప్రజాప్రతినిధులు



పరిగి: చిట్యాలలో కంటివెలుగుపై మాక్ డ్రైవ్ నిర్వహిస్తున్న అధికారులు

మోమిన్‌పేట: కంటి వెలుగు పేదల జీవితాల్లో వెలుగునిస్తుందని, ప్రతి ఒక్కరు కార్యక్రమాన్ని సద్వినియోగించుకోవాలని ఎంపీడీఓ శైలజారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో కంటి వెలుగుపై కార్యదర్శులు, వైద్యసిబ్బందితో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. రేపటి నుంచి ప్రారంభం కానున్న కంటి వెలుగు రెండో విడత కార్యక్రమంలో కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ప్రతి రోజు 150టోకెన్లు ఇవ్వాలని, టోకెన్లు పొందినవారే కంటి పరీక్షకు వచ్చేలా చూడాలని పేర్కొన్నారు. వైద్య సిబ్బంది కూడ వైద్య పరికరాలను సమయానికి వచ్చేలా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ యాదగిరి, కార్యదర్శులు నర్సింహులు, మైపాల్‌రెడ్డి, వైద్య సిబ్బంది ఉన్నారు.

కొడంగల్‌లో..

కొడంగల్: కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచులు, ఎంపీటీసీలకు వివిధ శాఖల సిబ్బందికి కంటి వెలుగు కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ కంటి వెలుగు కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరూ ఉచితంగా కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కంటి వెలుగు ప్రత్యేకాధికారి సారంగపాణి, డిప్యూటీ తహసీల్దార్ సురేష్, ఎంపీడీఓ పాండు, ఎంపీఓ శ్రీనివాస్, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

మర్పల్లిలో..

మర్పల్లి: కంటి వెలుగు కార్యక్రమంపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని డీఎల్‌పీఓ అనిత అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బట్టు లలిత అధ్యక్షతన నిర్వహించిన కంటి వెలుగు అవగాహన కార్యక్రమంలో డీఎల్‌పీఓ మాట్లాడుతూ ప్రతి కేంద్రంలో నిత్యం 120 నుంచి 130 మందికి తక్కువ కాకుండా కంటి వైద్య పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాటు చేశామని తెలిపారు. జెడ్పీటీసీ మధుకర్, వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీఓ మహేష్‌కుమార్, సూపరింటెంటెండ్ కృష్ణారావు, పట్లూర్ పీహెచ్‌సీ ఇన్‌చార్జి వైద్యాధికారి నేహా, ఏపీఓ అంజిరెడ్డి, ఏపీఎం మధుకర్ పాల్గొన్నారు.

నిరుపేదలకు వెలుగు

పరిగి: కంటి వెలుగును విజయవంతం చేసేందుకు అందరూ సమష్టిగా కృషి చేయాలని మున్సిపల్ చైర్మన్ అశోక్‌కుమార్ సూచించారు. ఈ మేరకు మున్సిపల్ కార్యాయలంలో అధికారులతో నిర్వహించిన అవగాహనలో ఆయన మాట్లాడారు. కంటి వెలుగు పథకం మంది నిరుపేదలకు వెలుగునిస్తుందని చెప్పారు. కౌన్సిలర్లు నాగేశ్వర్, మునీర్,నాయకులు మౌలానా, తహెర్‌అలీ పాల్గొన్నారు.

కార్యక్రమంపై మాక్ డ్రైవ్

కంటివెలుగు కార్యక్రమంపై చిట్యాలలో అధికారులు మాక్ డ్రైవ్ నిర్వహించారు. పథకం ఏ విధంగా నిర్వహించాలనే విషయంపై వైద్యాధికారి ద్వారా నుంచి ఎంపీడీఓ శేషగిరిశర్మ తెలుసుకున్నారు. యంత్రాలన్ని సక్రమంగా పనిచేస్తున్నాయాలేదా అనే విషయాలను తెలుసుకున్నారు.

బంట్వారంలో..



బంట్వారం: అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ బాలయ్య

బంట్వారం: కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బంట్వారం ఎంపీడీఓ బాలయ్య అన్నారు. మద్వాపూర్‌లో ర్యాలీ నిర్వహించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 19 నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. కంటి సమస్యలు ఉన్న వారు పరీక్ష చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, క్యాంప్ ఇన్‌చార్జి డాక్టర్ వందన, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మానస, హెల్త్ సూపర్ వైజర్ త్రివర్ణ, ఆప్తమాలజిస్టు నవీన్, మద్వాపూర్ సర్పంచ్ గోవింద్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి లక్ష్మి, ఎంపీహెచ్‌ఓ ఐలయ్య, ఏఎన్ఎం అమృత, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ప్రజలకు అవగాహన కల్పించాలి

పెద్దేముల్: కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పెద్దేముల్ మండల స్పెషల్ ఆఫీసర్ లలితకుమారి అన్నారు. ఈ మేరకు కంటివెలుగుపై మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న లలితకుమారి పంచాయతి కార్యదర్శులు, వైద్య సిబ్బందితో మాట్లాడారు. ప్రతి ఒక్కరు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు సమష్టిగా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మప్ప, తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డి, వైద్యాధికారి బుచ్చిబాబు, ఎంపీఓ షేక్‌సుస్మా, వైద్య సిబ్బంది అరుణకుమారి, పుష్పలత, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీవేంకటేశ్వర ఆలయంలో ధ్వజారోహణం



ధ్వజారోహణ పూజలు చేస్తున్న అర్చకులు

చేవెళ్ల: మండలకేంద్రంలోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో రథోత్సవం జాతర పూజలు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంగళవారం ఆలయ అర్చకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పుణ్యాహవచనం, ధ్వజారోహణం, అఖండదీపారాధన కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి శేషవాహన సేవ చేపట్టారు. ప్రతీ సంవత్సరం శివరాత్రికి నెల రోజుల ముందుగా ఆలయంలో రథోత్సవ జాతర ప్రారంభిస్తున్నట్లు ఆలయ అర్చకులు శ్రీకాంత్, శ్రీపాద్ తెలిపారు. మంగళవారం ప్రారంభమైన ఈ పూజలు ఈ నెల 21వరకు కొనసాగుతాయన్నారు. ఈనెల 21న రథోత్సవం ఘనంగా నిర్వహిస్తామన్నారు. 18న గజవాహన సేవ, 19న అన్నదాన కార్యక్రమం, హన్మంత వాహన సేవ, 20న గరుడవాహన సేవ కార్యక్రమాలు కొనసాగుతాయని చెప్పారు. మహాశివరాత్రి వరకు ఆలయంలో ప్రత్యేక పూజలు కొనసాగుతుంటాయని తెలిపారు.